నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, శనివారం 27 జనవరి 2024 | PEDDAPALLI

జగిత్యాలలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : సమాజంలో అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా స్పష్టం చేశారు. సంక్షేమంలో సరికొత్త అధ్యాయం సృష్టించి ప్రజల ఉద్యమ ఆకాంక్షలు, ప్రజాసంక్షేమమే ప్రాధాన్యాలుగా, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే బాధ్యతగా ముందుకు వెళ్తామన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రసంగించారు. రాష్ట్రం ప్రగతి వైపు పయనిస్తున్నదని, సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. అభయ హస్తం పథకంలో ఆరు గ్యారెంటీల అమలులో జిల్లాలో 3,35,781 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. రేషన్ కార్డుల కోసం 62,305 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇప్పటి వరకు 13,10,000 మంది వినియోగించుకున్నారని తెలిపారు. అర్హులైన మహిళలకు ప్రతి నెలా ₹2,500 ఆర్థిక సాయం, ₹500కే వంట గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వం త్వరలోనే అందిస్తుందన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ₹5 లక్షల నుంచి ₹10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. రైతు ఆర్థిక స్థితి పెరిగితే గ్రామాలు బాగుంటాయనే లక్ష్యంతో రైతు భరోసా పథకం ద్వారా రైతులు, కౌలు రైతులకు ఎకరానికి ఏడాదికి ₹15 వేలు, రైతు కూలీలకు ₹12 వేల ఆర్థికసాయం అందించనున్నట్లు చెప్పారు. ₹2 లక్షల రైతు రుణ మాఫీకి సంబంధించి బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నాయని, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే గృహ యజమానులకు గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి ₹5 లక్షల ఆర్థిక సహాయం, ఎస్సీ, ఎస్టీలకు ₹లక్ష అదనంగా ఆర్థిక సహాయాన్ని అందిస్తామని చెప్పారు. ఇళ్లు లేని తెలంగాణ అమవీరుల కుటుంబాలకు, ఉద్యమ కారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం పంపిణీ చేస్తామని, చేయూత పథకం ద్వారా వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు ₹5 వేలు త్వరలోనే అందిస్తామని వివరించారు. జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్న పార్లమెంట్ సభ్యులు, జడ్పీ చైర్‌పర్సన్, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శాంతి భద్రతలకు కృషి చేస్తున్న జిల్లా జడ్జి, ఎస్పీ, పోలీస్ యంత్రాంగానికి అభినందనలు చెప్పారు.

కరీంనగర్: పరేడ్ గ్రౌండ్‌లో జెండావిష్కరణ అనంతరం వందనం చేస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, ఎంపీ బండి సంజయ్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ సునీల్‌రావు, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

గణంగా.. తిరంగా

- అంబరాన్నంటిన గణతంత్ర వేడుకలు
- ఊరూరా త్రివర్ణ పతాక రెపరెపలు

కరీంనగర్‌లో సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థులు, చిన్నారులు

పెద్దపల్లి, జనవరి 26(నమస్తే తెలంగాణ) : గణతంత్ర వేడుకలు శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. ఉదయం విద్యార్థుల ర్యాలీలు, ప్రదర్శనలు, జయజయ నినాదాల నడుమ ఊరూరా సంబురాలు హోరెత్తాయి.. అనంతరం అంతటా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి.. కరీంనగర్ పోలీస్ పరేడ్ మైదానం, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి కలెక్టరేట్లలో కలెక్టర్లు పమేలా సత్పతి, యాస్మిన్ బాషా, అనురాగ్ జయంతి, ముజామిల్‌ఖాన్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఆయా కలెక్టరేట్లలో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు అందించారు. కరీంనగర్‌లో కలెక్టర్‌తో పాటు ఎంపీ బండి సంజయ్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించారు. అనంతరం పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు. అనంతరం వివిధ బ్యాంకుల నుంచి మహిళలకు రుణాల చెక్కులను అందజేశారు. కరీంనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవన్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జగిత్యాలలో జరిగిన వేడుకల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పాల్గొన్నారు. పెద్దపల్లిలో జరిగిన వేడుకల్లో జిల్లా జడ్జి డాక్టర్ డీ హేమంత్ కుమార్, పెద్దపల్లి జోన్ డీసీపీ ఎం చేతన, అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్ లాల్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని మహాత్మాగాంధీ స్టేడియంలో జరిగిన వేడుకలకు ఈడీ కేదార్ రంజన్‌పాడు హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిరిసిల్లలోని డీపీవో కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

సిరిసిల్లలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు గౌతమి పూజారి, భీమ్యానాయక్, ఎస్పీ అఖిల్‌మహాజన్

కార్మిక, ధార్మిక క్షేత్రాల ప్రగతే లక్ష్యం

సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి

రాజన్న సిరిసిల్ల జనవరి 26 (నమస్తే తెలంగాణ): కార్మిక, ధార్మిక క్షేత్రాల ప్రగతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తున్నామని రాజన్న సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మార్గదర్శనంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు యంత్రాంగం కృషి చేస్తున్నదని చెప్పారు. సిరిసిల్ల సమీకృత కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకలకు ఆయన హాజరై, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని చెప్పారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఇప్పటి వరకు సిరిసిల్ల, వేములవాడ డిపోల పరిధిలో 20.05లక్షల మంది మహిళలు జీరో టికెట్ ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారన్నారు. సర్కారు దవాఖానల్లో మెరుగైన వైద్యం అందుతున్నదని, ఆరోగ్యశ్రీ సాయం ₹10లక్షలకు పెరిగిందన్నారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించామని, లక్షా 92వేల 544 వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేశామని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాని చెప్పారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల పెంపు కోసం మిషన్ 80 పైలట్ ప్రాజెక్టు చేపట్టామని, 80శాతానికి పైగా డెలివరీలు పెరిగాయన్నారు. గర్భిణులు, బాలింతలకు త్వరితగతిన వైద్య సేవలందించేందుకు గానూ మాతృ సేవా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. రోగులకు అందిస్తున్న సేవలకు గానూ దవాఖానలకు కాయకల్ప అవార్డులు వచ్చాయని, జిల్లాలోని ఏడు పీహెచ్‌సీలకు ఎనాక్వాస్ సర్టిఫికెట్ లభించిందన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లాకు 5స్టార్ రేటింగ్ లభించిందని, ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ పట్టణంగా సిరిసిల్ల జాతీయ స్థాయిలో ధ్రువీకరించారని గుర్తు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం నిమగ్నమవుతున్న పోలీసులకు అభినందనలు తెలిపారు. అలాగే దక్షిణ కాశీగా పేరు గాంచిన వేములవాడలో అధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు గౌతమి పూజారి, భీమ్యానాయక్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగు పరుస్తాం

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడమే లక్ష్యంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. శుక్రవారం 75వ గణతంత్ర వేడుకల సందర్భంగా కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రసంగించారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేలా, వారికి భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా బాలికలు, మహిళలు, థర్డ్ జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేస్తున్నదని, ఇప్పటి వరకు 98,46,585 మంది జీరో టికెట్ ద్వారా ప్రయాణించారని తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి అర్హులైన వారందరికీ ₹10 లక్షల వైద్య సహాయం అందిస్తున్నామన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 1,751 మందికి వైద్యం అందించినట్లు చెప్పారు. అభయహస్తంలో భాగంగా ఆరు గ్యారంటీ పథకాల అమలుకు 3,22,264 దరఖాస్తులు స్వీకరించామని, వీటిని పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను చేపట్టామన్నారు. విద్యతోపాటు విద్యార్థులు సమాజంలో మంచి పౌరులుగా ఎదిగేందుకు, ఉన్నత విలువలు నేర్చుకునేందుకు స్నేహిత కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దీనిని గతేడాది జనవరి 10న చేపట్టి జిల్లాలోని 128 పాఠశాలల్లో ప్రతి శుక్రవారం రెండు పాఠశాలల్లో అమలు చేస్తున్నామన్నారు. ప్రజలకు రక్షణ, భద్రత కోసం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహుముఖ వ్యూహంతో అమలు చేస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. గంజాయి వంటి మాదక పదార్థాలతోపాటు ఇతర అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, మానేరుపై కొత్తగా నిర్మించిన కేబుల్ బ్రిడ్జిపై ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా పోలీసు ఔట్ పోస్టును ఏర్పాటు చేశామన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి ద్వారా గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 6,709 ఫిర్యాదులు స్వీకరించి 6,388 పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్న ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులందరికీ కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తున్న జిల్లా జడ్జి, పోలీస్ కమిషనర్, ఇతర పోలీసు అధికారులను, అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులను సైతం అభినందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావు, అదనపు కలెక్టర్లు, ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో కే మహేశ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్లు శ్యాం ప్రసాద్‌లాల్, అరుణశ్రీ, ఎమ్మెల్యే విజయరమణారావు

ప్రజలకు మెరుగైన సేవలు

పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, జనవరి 26(నమస్తే తెలంగాణ): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తున్నదని పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత రాజ్యాంగాన్ని రచించుకొని అమల్లోకి వచ్చిన రోజు రిపబ్లిక్ డే వేడుకలను జరుపుకొంటున్నామని చెప్పారు. పెద్దపల్లి కలెక్టరేట్ ఆవరణలోని పరేడ్‌గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత మాట్లాడారు. గతేడాది అసెంబ్లీ, సింగరేణి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్నామన్నారు. సర్కారు తెచ్చిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా జిల్లాలో 7.8 లక్షల మంది మహిళలు జీరో టికెట్‌తో ఉచిత బస్సు ప్రయాణం చేశారని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని ₹10లక్షలకు పెంచామని, 1339 మంది దీనిని వినియోగించుకున్నారని పేర్కొన్నారు. మహాలక్ష్మీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, చేయూత, గృహజ్యోతి లాంటి ఐదు గ్యారెంటీలకు అర్హుల ఎంపిక కోసం ప్రజాపాలన ద్వారా 2.4 లక్షలు దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. అర్జీలన్నింటినీ ఆన్‌లైన్ చేశామని వెల్లడించారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్, కార్పొరేషన్ వారీగా ప్రజా వాణి నిర్వహిస్తూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులను లాభాదాయక పంటల సాగు దిశగా ప్రోత్సహించేందుకు రైతు వేదికల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. గత వానకాలం ₹415 కోట్లకు పైగా విలువైన 1,88,918 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. సర్కారు స్కూళ్లల్లో నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యనందించేందుకు ప్రతి బుధవారం 'లంచ్ అండ్ లెర్న్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. వచ్చే పదోతరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధనకు పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్తున్నామని తెలిపారు. జిల్లాలోని చారిత్రక ప్రాంతాలను గుర్తించి వాటి ఔన్నాత్యాన్ని ప్రజలకు తెలియజేస్తామన్నారు. పెద్దపల్లిలోని రామగిరి ఖిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కాగా రిపబ్లిక్ వేడుకల్లో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులను కలెక్టర్, ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి కలెక్టర్ ఘనంగా సన్మానించారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

వేములవాడలో హెల్మెట్ ధరించిన వ్యక్తికి అరటిపండును అందజేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్

హెల్మెట్ ధరిస్తే పండు.. లేదంటే పువ్వు

వేములవాడలో ట్రాఫిక్ పోలీసుల వినూత్న అవగాహన

వేములవాడ, జనవరి 26: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేములవాడ పట్టణంలో ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు వినూత్నంగా అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు పండ్లు అందజేసి అభినందించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి ప్రమాదాలు జరిగే తీరును వివరించి, గులాబీ పూలు అందజేశారు. రో జురోజుకూ రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ తెలిపారు.

కోడి కోసం వెళ్లి కనిపించకుండాపాయె..

శ్రీనివాస్, సమ్మయ్య (ఫైల్)

పార్కింగ్ స్థలంలో ఇంకొకరు.. వేములవాడలో ఒకే జిల్లాకు చెందిన ఇద్దరు అదృశ్యం

వేములవాడ, జనవరి 26: సమ్మక్క-సారలమ్మ జాతరకు ముందు వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో నెల రోజులుగా రాజన్న దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఈ నెల 21న ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా గనపూర్ మండలం, సీతారాంపురం గ్రామానికి చెందిన పెద్ద శ్రీనివాస్-సరిత దంపతులు కుటుంబసమేతంగా రాజన్న సన్నిధికి వచ్చారు. మొక్కులు తీర్చుకున్నారు. 22న బద్ది పోచమ్మ ఆలయానికి వెళ్లారు. అక్కడ మొక్కులు చెల్లించుకునేందుకు సిద్ధమయ్యారు. అంతలోనే కోడిని తీసుకువస్తానని వెళ్లిన శ్రీనివాస్ (45) తిరిగి రాలేదు. అప్పటి నుంచి అక్కడి పరిసర ప్రాంతాల్లో ఎంత వెదికినా జాడ దొరకలేదు. తర్వాత బంధువులు, తెలిసిన వారి ఇండ్లలోనూ ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆయన భార్య సరిత శుక్రవారం వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే ఇదే జిల్లాకు చెందిన జంగిడి గ్రామానికి చెందిన దోర్నాల సమ్మయ్య (44) కూడా రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో ఈ నెల 22న అదృశ్యమైనట్టు ఆయన కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రెండు కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

కేసీఆర్ పాలనలోనే ఆలయాల అభివృద్ధి

- మాజీ మంత్రి ఈశ్వర్
- ఓదెల మల్లన్న సన్నిధిలో పూజలు

కొప్పుల, దాసరిని ఆశీర్వదిస్తున్న వేదపండితుడు

ఓదెల, జనవరి 26: కేసీఆర్ పాలనలోనే ఆలయాల అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఓదెల మల్లన్న ఆలయాన్ని దర్శించుకున్నారు. వారికి పాలకవర్గ సభ్యులు సాదర స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం ఈశ్వర్, దాసరి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం మాజీ మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఓదెల మల్లన్న ఆలయానికి ఎంతో విశిష్టత ఉన్నదని, కోరిన కోర్కెలు తీర్చే స్వయంభూవుగా ప్రజలు కొలుస్తారని చెప్పారు. కేసీఆర్ సర్కారు యాదాద్రి, వేములవాడ, కొండగట్టు, కాళేశ్వరం లాంటి అనేక దైవక్షేత్రాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఓదెల మల్లన్న ఆలయాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని, ఇంతలోనే ప్రభుత్వం మారడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుత సర్కారు ఓదెల మల్లన్న క్షేత్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఇక్కడ ఎంపీపీలు కునారపు రేణుకాదేవి, నూనేటి సంపత్, జడ్పీటీసీ గంట రాములు, ఆకుల మహేందర్, ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, డైరెక్టర్లు ఆరెల్లి మొండయ్యగౌడ్, బత్తుల రమేశ్, రౌతు జలపతి, కనికిరెడ్డి సతీశ్, మ్యాడగోని శ్రీకాంత్, కర్రె కుమారస్వామి, చింతం మొగిలి ఉన్నారు.

వేములవాడలో ఐటీ దాడుల పుకార్లు

వేములవాడ, జనవరి 26: ఇటీవలి కాలంలో వేములవాడ ప్రాంతంలోని భూముల ధరలకు రెక్కలు రావడంతో ₹20 కోట్ల నుంచి ₹50 కోట్ల వ్యాపారం జరిగిందన్న ప్రచారం జోరుగా సాగుతున్నది. ఈ నేపథ్యంలో వేములవాడలో ఇన్‌కంటాక్స్ అధికారుల దాడులు జరుగుతున్నాయనే పుకార్లు రెండు మూడు రోజులుగా గప్పుమంటున్నాయి. ఐటీ అధికారుల బృందం ఇక్కడకు వచ్చిందని, రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారుల కార్యాలయాలు, ఇండ్లపై ఏసమయంలోనైనా దాడులు చేయొచ్చనే వార్తలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో పట్టణంలోని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై అధికారులు ఇప్పటి వరకు ధ్రువీకరించకున్నా.. రెండు మూడు రోజుల నుంచి షికారు చేస్తున్న వార్తలతో వణికిపోతున్నారు. ఇప్పటికే అప్రమత్తమైనా.. ఎప్పుడు ఎక్కడ దాడి చేస్తారేమోనని భయపడుతున్నారు. ఎప్పటికప్పుడు తమ ఫోన్లు చూసుకుంటూ.. సమాచారం కోసం తెలిసిన వారికి ఫోన్లు చేస్తున్నారు. ప్రతి రోజూ పొద్దంతా భయపడడం, రాత్రి వరకు ఎక్కడా ఎలాంటి తనిఖీలు లేకపోతుండడంతో హమ్మయ్యా అనుకుంటున్నారు.